


# మహబూబ్‌నగర్

నాగర్‌కర్నూల్ వనపర్తి
జోగులాంబ నారాయణపేట

శుక్రవారం 20 జూన్ 2025 పేజీలు : 10


## గట్టు మండలానికి 780 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఉత్తర్వుల పంపిణీ



ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికై,మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు.



# రైతులకు మళ్లీ సంకెళ్లా?

**మహబూబ్ నగర్,**

గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ వద్ద ఇథనాల్ పరిశ్రమ వద్దని ధర్నా చేసిన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టుకు తరలించే క్రమంలో సంకెళ్లు వేయడం సంచలనంగా మారింది. దీనిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. చర్యను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంది. నాడు లగర్లలో కూడా రైతును సంకెళ్లతోనే ఆసుపత్రికి తరలించారు. గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడలో ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీన్ని వ్యతిరేకించిన స్థానిక రైతులు జూన్ 4న ఆందోళన చేశారు. అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన - మిగతా2లో

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలి



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలనీ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కొత్తకోట మండలంలోని వడ్డే వాట గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్

## ప్రతి పేదవాడిని ఆదుకోవాలానేదే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి పేదవాడిని ఆదుకోవాలానేదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్వ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



## ఆరోపణలు నిరూపించండి రాజకీయాలనుంచి తప్పుకుంటా

**సికింద్రాబాద్ :** కాళేశ్వరం కమిషన్ విషయంలో తనపై బురద చల్లడం సరికాదని,తనపై వచ్చిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.కాళేశ్వరం లో అవినీతి జరిగిందనే అంశంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అప్పటి మంత్రివర్గ ఉప సంఘం లో తనతో పాటు మరో ముగ్గురు మంత్రులు కూడా ఉన్నారని వారికి అన్ని వాస్తవాలు తెలుసని అన్నారు.బనకచర్ల పై ఆనాడే తాను మాట్లాడానని ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ లో కొట్లడిందే తానని తెలిపారు.కాళేశ్వరం కమిషన్ విచారణ త్వరగా పూర్తి చేస్తారన్న నమ్మకం తమకు లేదని,రిపోర్ట్ ఇస్తారనేది కూడా లేదన్నారు.వెంటనే సిబిఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్మంటే విచారణ ముగిసిన అనంతరం వచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో భాజాపా కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అవినీతి జరిగితే కూడా ఉపేక్షించేది లేదని అన్నారు. కాలేశ్వరం కేసీఆర్ నిర్మించింది కాదని జల యజ్ఞంలో భాగంగా ప్రాణహిత చేవెళ్లను రీడిజైన్ చేశారని అందులో 3 బ్యారేజీలు మాత్రమే కొత్తగా నిర్మించాలని వెల్లడించారు. ఈనెల 22 న 11 సంవత్సరాల భాజాప పాలనపై ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

## కిల్ సెల్ ఎనీమియాపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

**జగిత్యాల :** సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి పై ప్రతి ఒక్కరు అవగాహనా పొందాలని ఆదిశగా మన ప్రయత్నాలు సాగాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డా. ఎన్. శ్రీనివాస్ కోరారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా నివారణ దినోత్సవం పురస్కరించు కొని జగిత్యాల గవర్నమెంట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనిమియా జన్యుపరమైన వ్యాధి అని దీనిపైన ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ముందస్తు పరీక్షల ద్వారా గుర్తించి చికిత్స చేయడం అత్యవసరం అని ఆయన తెలిపారు. మామూలుగా ఎర్ర రక్త కణాల జీవితకాలం 100 నుంచి 120 రోజులని కానీ సికిల్ సెల్ ఎనిమియా బాధితులలో ఎర్ర రక్త కణాల ఆకారము కొడవలి లాగా వంపు తిరిగి ఉంటుంది అవి చిన్న రక్తనాళాల గుండా ప్రవహించినప్పుడు ఒత్తిడికి తట్టుకోలేక 10 నుంచి 20 రోజులలో కణాలు చనిపోతాయని తెలిపారు. అందువలన పేషెంట్లకు వారి కుటుంబ సభ్యులకి సంబంధించిన లేదా సేమ్ బ్లడ్ గ్రూప్ కు సంబంధించిన రక్త కణాలను డైరెక్ట్ గా ఎక్కించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ సుమన్ మోహన్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోవాలాను వరించిన ఎంఏసీ పదవి

**అదిలాబాద్ :** కష్టాన్ని నమ్ముకున్న వారికి ఎప్పటికి నష్టం జరగదని నిరూపించింది ఓ ఆటోవాలా కథ. డబ్బు, హోదా ఉన్న వారికి మాత్రమే కీలక పదవులు దక్కే ఈ రోజుల్లో పార్టీనే నమ్ముకుని.. కష్టకాలంలో జెండా మోసిన ఆ ఆటోవాలాను అదృష్టం వరించింది. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రానికి చెందిన సామాన్య కాంగ్రెస్ కార్యకర్త జి.కళ్యాణ్ గత కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కష్టకాలంలోనూ పార్టీ జెండా వదలకుండా నికార్సైన కాంగ్రెస్ సైనికుడిగా కష్టపడ్డాడు. నియోజక వర్గంలో దశాబ్దన్నర కాలంగా కాంగ్రెస్ గెలుపు సాధించకపోయినా పార్టీలు మారకుండా ప్రాణం కంటే ఎక్కువగా పార్టీ ఎదుగుదలకు చెమటోడుస్తూ వస్తున్నాడు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన లాంటివారి కష్టాలు తీరుతాయని భావించాడు. కానీ అతను కలలో కూడా ఊహించని ఓ పదవి తనను వరిస్తుందని మాత్రం ఊహించలేదు.ఆటో నడుపుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న జి.కళ్యాణ్ అనే ఆటోవాలాను ఆ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరించింది. దీంతో ఆ మండలంలో పండగ వాతవరణం నెలకొంది. కాంగ్రెస్ అంటేనే సామాన్యుల పార్టీ అంటూ అక్కడి హస్తం తమ్ముళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పదవి కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొన్నా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాత్రం పట్టుపట్టి సామాన్య కార్యకర్తకు ఈ పదవి ఇప్పించడంలో సక్సెస్ అయ్యారనే టాక్ నడుస్తోంది. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి వరించడంతో సంబరంలో మునిగిపోయిన ఆటోవాలా కల్యాణ్ పదవి స్వీకారానికి సైతం అదే ఆటోలో వ్యవసాయ మార్కెట్‌కు రావడం అందరిని ఆకట్టుకుంది. ఆటో నడుపుతున్న క్రమంలోనే, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నుంచి ఫోన్ రావడం.. నీకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఛాన్స్ వచ్చింది ప్రమాణ స్వీకారానికి రావాలని కళ్యాణ్‌ను ఆహ్వానించడంతో ఇది కలనా నిజమా అంటూ ఆశ్చర్యానికి లోనయ్యాడంట ఆటోవాలా కళ్యాణ్. వెంటనే అదే ఆటోలో ఏఎంసీ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.

## రైతులకు మళ్లీ సంకెళ్లా...

-మొదటిపేజీ తరువాయి

సంస్థ ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఆ సంస్థ ఫిర్యాదు మేరకు పోలీసులు కొందరు రైతులను అరెస్టు చేశారు. దాదాపు 41 మందిపై కేసులు పెడితే 12 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్‌లో ఉన్న రైతులను మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో ఇద్దరికి సంకెళ్లు వేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని, అధికారుల చర్యలను ప్రశ్నించాయి. కంపెనీకి కొమ్ముకాస్తు రైతులపై కేసులు పెట్టడమే కాకుండా వారికి సంకెళ్లు వేసి తరలించడం ఏంటని నిలదీశాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు సోషల్ మీడియా వేదికగా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. "లగచర్ల నుంచి రాజోలి దాకా రైతు చేతులకు సంకెళ్లు.. పౌర హక్కుల నేతలపై నిర్బంధాలు. ఇదే రేవంత్ రెడ్డి చెప్పే ఇందిరమ్మ రాజ్యం ఆనవాళ్లు!" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ..."జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతులకు సీఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. అలంపూర్ కోర్టు వద్ద అన్నదాతలకు పోలీసులు సంకెళ్లు వేసిన ఘటన ముఖ్యమంత్రి రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట. పెద్ద ధన్వాడలో గత కొన్ని నెలలుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అనేక గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే దారుణమైతే.. చివరికి దొంగలు, నేరస్తుల లాగా బేడీలు వేయడం క్షమించరాని నేరం. గతంలో లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకున్నారనే కోపంతో గుండెపోటు వచ్చిన రైతుపై కనికరం కూడా లేకుండా బేడీలు వేసి, ఈ ముఖ్యమంత్రి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. ఇప్పుడు పెద్ద ధన్వాడ రైతుల విషయంలో కూడా ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి అన్నదాతల చేతిలో గుణపాఠం తప్పదు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుంది కాబట్టి రేవంత్ వెంటనే రైతులందరికీ క్షమాపణ చెప్పాలి. " అని డిమాండ్ చేశారు. సర్వత్రా విమర్శలు రావడంతో సంకెళ్లు వేసిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒక ఆర్ఎస్ఐ. ఇద్దరు ఏఆర్ఎస్ఐలను సస్పెండ్ చేసింది. ఇలా సంకెళ్లు వే?కొని కోర్టులో హాజరుపరిచిన రైతులకు జిల్లా న్యాయమూర్తి ప్రేమలత షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. దీంతో వాళ్లను మహబూబ్‌నగర్ జైలుకు తరలించి విడుదల చేశారు.

# జూబ్లీహిల్స్‌లో గెలుస్తా... అజారుద్దీన్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యం అయింది. అధికార పార్టీ నుంచి ఎవరు పోటీ చేస్తారని అంశంపై పార్టీలోను, నియోజకవర్గంలోనూ పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు మహమ్మద్ అజారుద్దీన్ ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నట్లు స్పష్టం చేశారు. తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో చివరి క్షణంలో టికెట్ ఇచ్చినప్పటికీ ఆఖరి వరకు పోరాడానని తక్కువ ఓట్లతో ఓడిపోవడం జరిగిం దని అన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సగం సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చేలా తాను పనిచేశానని అన్నారు. తమ పార్టీలోనే ఉన్న కొంతమంది వ్యక్తులు కావాలని కొన్ని పత్రికల్లో, మీడియా



మాధ్యమాల్లో, వెబ్ సైట్ల లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని, తనకు టికెట్ ఇవ్వడంలేదని ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని కూడా తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో నమ్మకంగా ఉన్న తనకు ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసి వేణు గోపాల్ ఆశీస్సులు ఉన్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి గడిచిన ఏడాదిన్నర కాలంగా పని చేస్తున్నామని, ఇప్పటికీ పలుమార్లు బూత్ స్థాయి లో, డివిజన్ స్థాయిలో సమావేశాలు సైతం నిర్వహించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో తాను జూబ్లీహిల్స్ నియోజకవర్గం టికెట్ తెచ్చుకొని, గెలిచి రాహుల్ గాంధీ కి బహుమతిగా అందిస్తామని అన్నారు. నాంపల్లి నాయకుడు ఫిరోజ్ ఖాన్, ఇర్ఫాన్ అజీజ్, ఫహీమ్ కురేషీ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్ లో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. మైనార్టీ ఎమ్మెల్యే కూడా లేరు. జూబ్లీహిల్స్ నుంచి మైనార్టీ నేతకే చాన్స్ ఇవ్వనున్నారు. ఈ సారి మజ్లిస్ మద్దతు కూడా లభించడం ఖాయం కావడంతో ఇక్కడ గెలిచే వారికి మంత్రి పదవి వస్తుందని భావిస్తున్నారు. అందుకే పోటీ మరింత తీవ్రంగా ఉంది.

## మల్కాజిగిరి ప్రజల సమస్యలను తీర్చే ప్రయత్నం చేసాను

**సికింద్రాబాద్ :** ఈటల రాజేందర్ గురువారం మీడియాతో మాట్లాడారు. 11 ఏళ్ల అభివృ ద్ధిపై దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, సమావేశాలు జరుగుతున్నాయి. మల్కాజ్గిరి దేశం లోనే అతిపెద్ద నియోజకవర్గం. 38.4 లక్షల ఓట్లు ఉన్నాయి. బీజేపీని 4 లక్షల మెజారిటీతో గెలిపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో పోలైన ఓట్లలో 65 % ఓట్లు వేసి గెలిపిం చారు. ప్రజలు విశ్వాసాన్ని, నమ్మకాన్ని నా మీద ఉంచారు నాకు ఉన్న అనుభవం పరిచ యాలతో.. వారి నోట్లో నాలుకలాగా ఉన్నంతలో వారి ప్రేమను పొందే ప్రయత్నం చేశా ను.. ఉన్నంతలో వారి సమస్యలను తీర్చే ప్రయత్నం చేశానని అన్నారు. 11 సంవత్సరాల మోదీ పాలన సంవత్సర కాలంగా నేను ప్రజల్లో గడిపిన కాలాన్ని ఎగ్జిబిషన్ రూపంలో చెప్పబోతున్నాము. ఉద్యమకాలంలో అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ గా, తొలి ఆర్థిక మంత్రిగా, కష్ట కాలంలో కరోనా మంత్రిగా పని చేసిన నామీద అపారమైన నమ్మకం ప్రజలకు ఉంది. అనేక ఉద్యమాలు చేసిన వాన్ని కాబట్టి మల్కాజిగిరిలో కూడా ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో నావంతుపాత్ర పోషించానని అన్నారు.

## ఆయిల్ బాల్స్ తో దోమల నివారణ

### సానిటరీ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి

జగిత్యాల : వర్షాకాలం దృష్ట్యా మురికి గుంతల్లో, నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా మున్సిపల్ పక్షాన దోమల నివారణకు చర్యలు చేపట్టామని జగిత్యాల మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలి





**– వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ప్రతినిధి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలనీ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కొత్తకోట మండలంలోని వడ్డే వాట గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్ అనంతరం అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. కంసలి పార్వతమ్మ భర్త కంసాలి సాంతన్న ఇంటిని సందర్శించిన కలెక్టర్ ఇల్లు మంజూరు అయినప్పటికీ నిర్మాణం ఇంకా ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. ప్రస్తుతం ఆషాఢ మాసం నడుస్తుందనీ రోజులు బాగాలేవనీ అందువల్ల ప్రారంభించలేదని పార్వతమ్మ సమాధానం చెప్పారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని, త్వరగా ప్రారంభిస్తే బేస్మెంట్ పూర్తి కాగానే అందరితో పాటు మొదటి విడత లక్ష రూపాయలు ఖాతాలో జమ అవుతాయన్నారు. నిర్మాణం అయ్యే నాటికి విడతల వారిగా డబ్బులు ఖాతాలో జమ అయిపోతాయన్నారు. ఆషాఢం అని రోజులు బాగా లేవని మూఢ నమ్మకాలతో కాలాయపన చేయవద్దని, గడువు లోపల ఇంటి నిర్మాణం ప్రారంభించకుంటే మంజూరు అయిన ఇళ్లు సైతం రద్దు నమ్మకాలతో కాలరాసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో మొత్తం 23 ఇళ్ళు మంజూరు కాగా మూఢ నమ్మకాలతో చాలా మంది నిర్మాణం ప్రారంభించ లేదు. గ్రామంలో మిగిలిన వారి ఇంటిని కూడా కలెక్టర్ స్వయంగా వెళ్లి త్వరగా ముగ్గులు పోసి నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. అనంతరం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి జిల్లా కలెక్టర్ భూమి పూజ చేసారు. డి. పద్మమ్మ భర్త నాగేష్ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా గురువారం ముగ్గు పోసి భూమి పూజ పెట్టుకున్నారు. కలెక్టర్, తహసీల్దార్ స్వయంగా వెళ్లి భూమి పూజ చేసి పంచాయతీ సెక్రెటరీ ద్వారా జియో ట్యాగింగ్ చేసి ఆన్లైన్ లో ఆప్లోడ్ చేయించారు. వెల్టూరు గ్రామ పంచాయతీ భవనంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ వెల్టూరు గ్రామానికి 34 ఇళ్ళు మంజూరు అయ్యాయని లబ్ధిదారులు అందరూ త్వరగా ముగ్గులు పోసుకొని నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత పొందిన ప్రతి అమ్మాయిని కళాశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలిదపదవ తరగతిలో ఉత్తీర్ణత పొందిన ప్రతి అమ్మాయిని కళాశాలల్లో చేర్పించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నుండి ఎంతమంది అమ్మాయిలు ఉత్తీర్ణత సాధించారు వారు ఇప్పుడు ఏంచేస్తున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. 5 మంది అమ్మాయిలు కె.జి.బి.వి లలో చేరారని, ఇంకా 6 మంది అమ్మాయిలు ఉన్నారు ఉన్నారని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు. అమ్మాయిలను కళాశాలలకు పంపకుండా బాల్య వివాహాలు చేసే ప్రమాదాలు ఉంటాయని, అందువల్ల ఖచ్చితంగా కళాశాలల్లో చేరే విధంగా ప్రధానోపాధ్యాయులు, పంచాయతి కార్యదర్శి బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దమందడి తహసిల్దార్ సరస్వతి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పెట్టుబడి భరోసా

**రూ.140.07 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ**



**గద్వాల జూన్ 19(ప్రజాజ్యోతి ప్రతినిధి):** రైతు భరోసా పథకం వల్ల పెట్టుబడి భారం తగ్గి రైతులు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.రైతు అభివృద్ధినే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద,వానాకాలం సాగు ప్రారంభానికి ముందే జోగులాంబ గద్వాల జిల్లాలోని చిన్న,సన్నకారు రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ చేసిందని తెలిపారు.గురువారం సాయంత్రం వరకు నాలుగు ఎకరాల లోపు భూమి కలిగిన 1,35,024 మంది రైతులకు140 కోట్లు7లక్షల76వేల525 రూపాయలు సాయం అందించబడిందని తెలిపారు.ఈ నిధులు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ కావడం వల్ల వారు ఎలాంటి ఆలస్యం లేకుండా విత్తనాలు,ఎరువులు,కూలీల ఖర్చులు మొదలైన అవసరాలను తీర్చుకునే అవకాశం లభిస్తుందని అన్నారు.రైతుల బ్యాంక్ ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ శాఖ అధికారులు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేయడం,వారి భూ వివరాలను అనుసరించి అర్హత గలవారికి నిధులను విడుదల చేయడం వంటి ప్రక్రియలు సమర్థంగా నిర్వహించబడినట్లు తెలిపారు. మిగిలిన రైతుల ఖాతాల్లోనూ త్వరలోనే నిధులు జమ చేయబడతాయన్నారు.రైతు భరోసా పథకం వల్ల పెట్టుబడి భారం తగ్గి రైతులు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.ఈ పథకం రైతులకు కేవలం ఆర్థికంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా స్థిరత్వాన్ని ఇస్తోందని,ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. విత్తనాలు వేసే ముందే సాయం అందడం వల్ల రైతులు అప్పుల ఊబిలో పడకుండా సాగు చేసే అవకాశం లభిస్తుందని, ఇది వ్యవసాయ ఉత్పాదకతను మరింత పెంపొందించగలదని అన్నారు. ప్రతి ఎకరాకు మద్దతుగా ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు.ఇది కేవలం నిధుల పంపిణీ మాత్రమే కాదురైతన్నలపై ప్రభుత్వం ఉంచిన విశ్వాసానికి నిదర్శనం,"అని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పలు ఆలయాలలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,జూన్ 19 (ప్రజా జ్యోతి):** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వరి, అయ్యప్ప స్వామి దేవాలయాలను తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక,మత్స్య,పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు,యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులను,అయ్యప్ప స్వామి భక్తులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు మంత్రికి పూల మొక్కలు, పలకలు, నోట్ బుక్స్ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు డ్రస్సులు పంపిణీ..




**దేవరకద్ర జూన్ 19 ప్రజాజ్యోతి** మండల పరిధిలోని బలుసు పల్లి గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పు ట్ట చంద్రమౌళి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొక్కల ఆంజనేయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు స్రవంతి గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అయాం లో ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ..



**గుండుమాల్ జూన్ 19 ప్రజా జ్యోతి** గుండుమాల్ మండల పరిధిలోని బీసీ కాలనీలో గురువారము మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.విక్రమ్ రెడ్డి,ఎక్స్ సర్పంచ్ ఎస్.సురేష్ రెడ్డి,ఎక్స్ ఎంపీపీ మధుకర్ రావు, ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన 49మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో భాగంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి ప్లానింగ్ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎక్స్ ఎంపీపీ మధుకర్ రావు,గ్రామ పంచాయతీ కార్యదర్శి, సాయి ప్రకాష్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడిని ఆదుకోవాలానేదే ప్రభుత్వ లక్ష్యం



-రాష్ట్ర పశుసంవర్ధక,మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి,క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,జూన్ 19 (ప్రజా జ్యోతి):** ప్రతి పేదవాడిని ఆదుకోవాలానేదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశు సంవర్ధక మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గంలోని నర్వ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్వ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నిన్నటి నర్వ 18 నెలలలో రూపురేఖలు మార్చి అభివృద్ధి చేశామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మూడు కోట్లు ఇందిరమ్మ క్యాంటీన్, అంబులెన్స్ ఇచ్చామని తెలిపారు. నర్వ మండలంలో 5.25 ఎకరాలలో ఇంటర్మీడియట్ కాలేజీ. మరియు క్రీడా గ్రౌండ్ తయారవుతుందన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే రుణమాఫీ చేశామని, పెన్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని ఇది మంచి అవకాశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని, ఇప్పటికే చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మహిళలకు ప్రయాణించడానికై బస్సులలో ఉచిత ప్రయానించుటకు మహా లక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. మహిళలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని ఇంకా అభివృద్ధి చేస్తానని ఐదు సంవత్సరాల లో 150 కోట్లు ఇచ్చి నర్వను అగ్రగామిగా నిలబెడతామన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ కాపిలను అందజేశారు. నర్వ మండలం 139 మరికల్ మండలానికి 33 మంది లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి అందజేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మంత్రి, పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఇండ్లు లేని వారిని గుర్తించి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రూపాయలు విడతల వారి కి ఇస్తున్నామని ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా రాష్ట్రంలో ఇంటి నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. నాలుగు విడతలలో రూ .5 లక్షలు ఇస్తున్నట్లు త్వరగా ఇంటి నిర్మాణాలు స్టార్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఈఓ శైలేష్, పిడి హౌసింగ్,శంకర్, డి.ఈ.హరికృష్ణ, తహసీల్దార్ మల్లారెడ్డి, రాంకోటి, సాగర్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవోలు టి.శ్రీనివాస్, కొండన్న, నంగి దేవేందర్ రెడ్డి, పోలీస్ చంద్ర శేఖర్ రెడ్డి, పోలీస్ జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గట్టు మండలానికి 780 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఉత్తర్వుల పంపిణీ



**గద్వాల జూన్ 19(ప్రజాజ్యోతి డివిజన్):** ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికై,మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు.గురువారం గట్టు మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమంలో గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి పాల్గొని,లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,పేదవారి సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,అందుకే ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.పైలెట్ ప్రాజెక్టుగా గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామాన్ని ఎంచుకొని గతంలోనే ఎక్కువ ఇళ్లు మంజూరు చేయగా, ఈసారి గద్వాల్ నియోజకవర్గానికి మొత్తం 3500 ఇళ్లలో గట్టు మండలానికే అత్యధికంగా 780 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.ఇల్లు మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు 45 రోజుల్లో పనులు ప్రారంభించి, ఏడాది లోపు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన రూ.5 లక్షలు ప్రభుత్వం విడతలవారీగా విడుదల చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికై,మంజూరు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించు కోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు గుడిసెలో కాకుండా గౌరవంగా స్వంత ఇళ్లలో జీవించాలనే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.మొదటి విడత పూర్తయిన తరువాత అర్హులైన మిగిలిన వారికి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని తెలియజేశారు. అంతేకాక, రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వ ఆలోచనల్ని వివరిస్తూ, 'రైతు భరోసా' కింద నాలుగు ఎకరాలపైనా ఇప్పటివరకు140 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. గట్టు మండలంలో విద్యా రంగంలో జరిగిన మార్పు ప్రశంసనీయమని, గతంలో అక్షరాస్యత లోపించిన ఈ ప్రాంతం ఇప్పుడు మెడికల్, ఇంజనీరింగ్ తదితర రంగాల్లో విద్యార్థుల విజయాలతో ముందంజ వేస్తోందని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు ఉన్నాయన్న విషయాన్ని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై శ్రద్ధచూపాలని సూచించారు. గట్టు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, గట్టు మండల అభివృద్ధి కోసం నిరంతరం ప్రత్యేక కృషి చేస్తున్నామని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం గద్వాల్ నియోజకవర్గానికి మంజూరు చేసిన 3500 ఇందిరమ్మ ఇళ్లలో 780 ఇళ్లు గట్టు మండలానికే కేటాయించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతి పేదవారి సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, గద్వాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్ల హనుమంతు, ఎంపీడీఓ చెన్నయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## లోన్ బీమా మహిళా సంఘాలకు భీమా


-స్త్రీ నిధి మేనేజర్ పి.విక్రమ్ కుమార్



**నాగర్ కర్నూల్ : జూన్ 19** ప్రజా జ్యోతి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న లోన్ బీమా, ప్రమాద భీమా పథకాలు స్వయం సహాయక సంఘ సభ్యులకు భీమాను కల్పిస్తున్నాయని నాగర్ కర్నూలు స్త్రీనిది మేనేజర్ పి.విక్రమ్ కుమార్ అన్నారు.గురువారం బిజినేపల్లి మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో మహిళా సంఘ సభ్యులతో భీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల లోని సభ్యులు స్త్రీనిది,బ్యాంక్ లింకేజ్ రుణం పొంది సహజంగా మరణించినట్లయితే ఆ రుణం మరణించిన సభ్యురాలు కుటుంబానికి, సంఘానికి భారంగా మారకుండా భీమా సదుపా యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.అదేవిధంగా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉండి ప్రమాదవశాత్తు మరణించిన సభ్యురాలికి గరిష్టంగా 10 లక్షల భీమాను కల్పిస్తుందని లోన్ బీమా,ప్రమాద బీమా పథకాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి స్త్రీనిది ద్వారా బీమా మొత్తం అందజేస్తుందని తెలిపారు.అనంతరం పలు సంఘాలలోని సభ్యులకు జీవనోపాధి రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో వివోఏ రామ్ చందర్,మహిళా సంఘాల లీడర్లు,సభ్యులు పాల్గొన్నారు.

## వనపర్తిలో ఘనంగా రాహుల్ గాంధీ 55వ పుట్టిన రోజు వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**వనపర్తి ప్రతినిధి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో గురువారం వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చీర్ల చందర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సిద్ధించిందనీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రతి పేదవాడు కూడా గూడు నీడ ఉండాలని ఆలోచన తోటి కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లతో పేదవాడి కళ సాకారం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి మైనార్టీ జిల్లా నాయకులు ఎండి రహీం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు గంధం కృష్ణ బాబు ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు శ్రీకాంత్ అందరు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒకరికొకరు కేక్ తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు.

# ఇరిగేషన్ కాలువల కోసం భూసేకరణ వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ప్రతినిధి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన కాలువల భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల భూ సేకరణ పై గురువారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్లో ఇరిగేషన్ రెవెన్యూ సర్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ కేటగిరి ( ఎ) కింద ఉన్నటువంటి భూసేకరణను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఘనపూర్ మండలంలోని షాపూర్ గ్రామ పరిధిలో 28 ఎకరాలు, మల్కాపూర్ లో 8.35 ఎకరాలు, బుద్ధారం గ్రామ పరిధిలో 109 ఎకరాల భూసేకరణకు సంబంధించి వారం రోజుల్లో అవార్డు పాస్ చేయాలని ఆదేశించారు. రేమద్దుల గ్రామ పరిధిలో 6 ఎకరాలు, గణపసముద్రంలో 388 ఎకరాలకు ఎంజాయ్మెంట్ సర్వే 10 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సర్వే అధికారిని ఆదేశించారు. అదేవిధంగా గోపాలపేట మండలం పోల్కే పహాడ్, దత్తయపల్లిలో 12.87 ఎకరాలకు త్వరగా అవార్డు పాస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణలో ఉన్న స్ట్రక్చర్ లను గుర్తించి వాటి వ్యాల్యూషన్ వివరాలు సమర్పించాలని ఆర్. డబ్ల్యూ.ఎస్., ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు ఇరిగేషన్ ఎస్. ఈ శ్రీనివాస్ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీరు మధుసూదన్, ఆర్. డబ్లు.ఎస్ ఈ. ఈ మేఘా రెడ్డి, ఇరిగేషన్ డి. ఈ లు, ఏ. ఈ లు, జి. సెక్షన్ సూపరిండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మన ప్రాచీన కళలను కాపాడుకుందాం

**– రంగస్థల కళలు మన వారసత్వ సంపద**

**– కళాకారులను ఘనంగా సన్మానించి కళా బృందానికి విరాళాన్ని అందజేసిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**




**వనపర్తి ప్రతినిధి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలైన ప్రాచీన రంగస్థల కళలలను బ్రతికించుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామంలో గత మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర (జీవ సమాధి ఘట్టం) చివరి రోజు నాటక ప్రదర్శనకు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారుల అద్భుతమైన నాటక ప్రదర్శనను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళలు మానసిక ఆనందాన్ని ఇవ్వడమే గాక గొప్ప సంస్కారాన్ని ప్రబోధిస్తాయని చెప్పారు. సినిమాలు, టీవీలు, సెల్ ఫోన్లు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందనీ ఎంత కాలక్షేపాన్ని అందించినా నాటక రంగం యొక్క గొప్పదనం ఉందంటే అది పల్లె ప్రజల ఔదార్యానికి నిదర్శనమని కొనియాడారు. దీని వల్ల ప్రతి ఒక్కరిలో చక్కటి అనుబంధం పెంపొందుతుందని తెలిపారు. భావితరానికి రంగస్థల కళలలను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన సూచించారు. చిన్ననాడు తాను చూసిన నాటకాలను ఎస్పీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నాటకంలో పాల్గొన్న పాత్రధారుల అభినయాన్ని ప్రశంసిస్తూ శాలువా పూలమాలలతో సన్మానించారు. అంతేగాక నాటక సమాజం వారికి జిల్లా ఎస్పీ ఐదు వేల రూపాయల నగదు విరాళాన్ని అందజేశారు. అనంతరం గ్రామస్తులు, కళాబృందం వారు ఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి, శ్రీ రంగాపూర్ ఎస్సై రామకృష్ణ, గ్రామ పెద్దలు, యువకులు, కళాకారులు, ఇతర గ్రామాల నుండి వచ్చిన కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి దరఖాస్తు పరిష్కరించాలి

**కలెక్టర్ విజయేందిర బోయి**

**సి.సి.కుంట మండలం అమ్మపూర్ రెవెన్యూ సదస్సును సందర్శించిన కలెక్టర్ విజయేందిర బోయి**



మహబూబ్ నగర్ జూన్ 19 ( ప్రజా జ్యోతి ప్రతినిధి ) భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. గురువారం సి.సి.కుంట మండలంలోని ఆమ్మాపూర్ గ్రామపం చాయతీలో జరుగుతున్న ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో రైతుల తో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఏ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో విచారణ పూర్తయిన వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి తదితర పూర్తి వివరాలతో విలేజ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దారు ను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో తహశీల్దార్ ఎల్లన్న, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..



**దేవరకద్ర జూన్ 19 ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో భావి భారత ప్రధాని, కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్రనాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారము ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే జి మసూద్ రెడ్డి సమక్షంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కేకు కట్ చేసి కార్యకర్తలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం ఎండనక, వాననక, చలిని, మంచును తట్టుకుని అలుపెరగకుండా 4000 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసిన గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఫరూక్ అలీ, దేవస్థానం చైర్మన్ నరసింహారెడ్డి, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కిషన్ రావు, రాఘవేంద్ర రెడ్డి, రాంపండు శ్రీనివాస్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి కిరణ్ జవహర్ రామస్వామి జగ్గు ప్రేమ్ వి విధ గ్రామాల కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పేదల సంక్షేమమే ప్రభత్వ లక్ష్యం

**–సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ : 19 జూన్** ప్రజా జ్యోతి నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 6 వ, వార్డులో అయ్యప్ప దేవస్థానం దగ్గర సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించి అయ్యప్ప స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వివిధ వార్డులలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల హక్కులను కాపాడేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఇలాంటి పథకాలను అమలు చేస్తోందని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నరు.

# విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

- సి.సి.కుంట మండలం ఉంద్యాల జడ్.పి.ఉన్నత పాఠశాల ను సందర్శించిన కలెక్టర్



**మహబూబ్ నగర్ జూన్ 19 ( ప్రజా జ్యోతి ప్రతినిధి )** సి.సి కుంట మండలం ఉంద్యాల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించి విద్యా ప్రమాణాలు పెంపొందించాలని కలెక్టర్ అధ్యాపకులకు సూచించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న సంసిద్ధత కార్యక్రమాలు కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో 4, 5 వ తరగతి విద్యార్థిని విద్యార్థులచే తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలు చదివించారు. నోట్స్ బుక్ లో సంసిద్ధత లో బాగంగా రాసినవి పరిశీలించారు. ఇంగ్లీష్ స్పెల్లింగ్ లు విద్యార్థులను అడిగారు. గణిత ఎక్కాలు కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం 7, 9,10 వ తరగతి చదువుతున్న విద్యార్థుల తో మాట్లాడారు. 10 తరగతి లో పాఠ్యాంశాలు, బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు మీరు టెన్త్ లో ఎన్ని మార్కులు సాధించాలి అనుకున్నారు మంచిగా చదివి ఉన్నత సాయికి ఎదగాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు కష్టమైన సబ్జెక్ట్ లపై దృష్టి సారించి బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్ లో మంచిగా స్థిర పడాలని ఆకాక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ.ఐ.కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. జడ్.పి.పాఠశాల నిర్మిస్తున్న ప్రదేశాన్ని స్లాబ్, గోడలు పూర్తి అయిన 4 తరగతి గదులు కలెక్టర్ పరిశీలించారు. మళ్లీ 15 రోజుల తర్వాత వస్తానని విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏం.ఈ ఓ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ప్రపంచానికి పెనుముప్పు

-యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ధర్నా నిర్వహించిన వామపక్షాలు

పాలస్తీనా గాజా ఇరాన్ దేశాలపై అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణ హోమాన్ని ఆపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి

బి ఆంజనేయులు డిమాండ్



**జూన్ 19 గద్వాల (ప్రజా జ్యోతి)** వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు నిరసన ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ గత 20 నెలలుగా పాలస్తీనా గాజాపై, పది రోజులుగా ఇరాన్ పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ దౌర్జన్య ఖాండను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాలస్తీనా యుద్ధంలో 50 వేల మంది మరణించారని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు గాజా మొత్తం సర్వనాశనం అయ్యిందని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు, బందీలుగా చిక్కి కనీస అవసరాలు లేక బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు .విద్యా వైద్య రంగాలు నాశనం అయ్యాయని వ్యవసాయ పారిశ్రామిక రంగాలు పూర్తిగా దెబ్బతినాయని అన్నారు.ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు ప్రధాన కారణం అమెరికా సామ్రాజ్యవాద వైఖరే అని అన్నారు. ప్రపంచంపై అధిపత్యం కోసం ఆయుధాల వ్యాపార విస్తరణ కోసం సహజ వనరుల కోసం చేస్తున్న అమెరికా చేస్తున్న నియంతృత్వ విధానాలను ప్రపంచం మొత్తం ఖండించాలని అన్నారు. సామ్రాజ్యవాద దేశాలు చేసే ప్రపంచ యుద్ధాల వల్ల శాంతి కనుమరుగవుతుందని ఆకలి దారిద్రం పెరిగి సంపద మరింత కేంద్రీకృతం అవుతుందని అన్నారు ప్రపంచ యుద్ధాల పెరుగుదల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా పెట్రోల్ డీజిల్ ఆహార వస్తువుల ఎగుమతి దిగుమతులపై ప్రభావం చూపి భారతదేశము కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు భారత దేశ విదేశాంగ విధానంలో పేర్కొన్న విధంగా మన దేశం సామ్రాజ్య వ్యతిరేక వైఖరి కలిగి ఉండి అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో.. సిపిఐ జిల్లా కార్యదర్శి. ఆంజనేయులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ,ఉప్పేర్ నరసింహ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్. శంకర ప్రభాకర్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్కూర్ రంగన్న,ఆశన్న , ఏఐఎస్ఎఫ్ ,జిల్లా కార్యదర్శి ప్రవీణ్ , ఏ ఐ టియుసి, జిల్లా నాయకుడు కాశిం, ప్రజా ఫ్రంట్ నాగన్న,ఏఐటీయూసీ బైక్ రిక్షా కార్మికులు ప్రభుదాస్, దర్శాన్న, తిమ్మప్ప,కృష్ణ, ఆటో యూనియన్ సీపీఐ నాయకులు నాగరాజు, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు

# నూతన జంటను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : జూన్ 19** ప్రజా జ్యోతి నాగర్ కర్నూల్ మున్సిపల్ కో- ఆప్షన్ మాజీ సభ్యుడు బి.ఆర్.ఎస్ పార్టీ మైనారిటీ నాయకుడు మహమ్మద్ ముస్తాఖ్ అహ్మద్ సోదరుడు ఖాజా ఎఖ్బాల్ అలీ కుమారుడు ఖాజా నవీద్ అలీ వివాహం ఇటీవల జరగడంతో విదేశాలలో ఉన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట బిఆర్ ఎస్ నాయకులు,మైనార్టీ నాయకులు ఉన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రిడ్జ్ అందజేసిన జికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్..



**దేవరకద్ర జూన్ 19 ప్రజాజ్యోతి** జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం దేవరకద్ర లోని పాత బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పండ్ల పంపిణీకి వెళ్లిన జి కె ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోన రాజశేఖర్ దృష్టికి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ శరత్ చంద్ర ఆస్పత్రిలో ఉన్న ఫ్రిడ్జ్ రిపేరులో ఉన్నందున మందులు నిల్వచేసేందుకు ఇబ్బందిగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రికి ఒక ఫ్రిడ్జ్ కావాలని కొ రగా వెంటనే స్పందించిన కోన రాజశేఖర్ స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం 14000 వేల రూపాయల విలువగల ఫ్రిడ్జ్ ను అందజేసిన జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు కోన రాజశేఖర్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర పట్టణ ఉపాధ్యక్షుడు జవహర్, ఆసుపత్రి సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**జడ్చర్ల జూన్ 19 (ప్రజా జ్యోతి)** అన్ని వర్గాల ప్రజలకు చట్టసభల్లో సమన్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ ఆదేశానుసారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కుల గణన చేపట్టి బీసి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర అసెంబ్లీ లో చట్టం చేసినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. కాబోయే భావి ప్రధాని రాహుల్ గాంధీ నాయకత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశ గా ప్రయాణిస్తుందని దిమా వ్యక్తం చేస్తూ కాబోయే భావి ప్రధాని రాహుల్ గాంధీ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ మినహాజుద్దీన్, అశోక్ యాదవ్, నిత్యానందం, రవి శంకర్, మాలిక్ షాకీర్, వెంకటయ్య, వంశీ చారి, ఖాజా పాషా, వాసు యాదవ్, గంగా నాయక్, శ్రీకాంత్ రెడ్డి, రఘు, మహమ్మద్, రమేష్, స్వప్న, లక్ష్మమ్మ, అంజి బాబు, ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు అర్ అర్ కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్ జూన్ 19 ( ప్రజా జ్యోతి ప్రతినిధి )** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు అర్ అర్ కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామ గడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రం లో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. అక్కడ నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్, అంగన్వాడీ, ఫంక్షన్ హాల్ వంటి ఇతర మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తయ్యేలా





పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్. ఎ.) మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ పాఠశాలల యజమాన్యాలు విద్య ముసుగులో దోపిడీ

**-విద్యార్థులకు బుక్స్ అమ్ముతూ పట్టుబడిన చర్యలు తీసుకొని విద్యాధికారులు**

**-విద్యాశాఖ అధికారులకు పిల్లల భవిష్యత్తు ముఖ్యం కాదు వారికి కావాల్సింది సంపద**

**-కలెక్టర్ చర్యలు తీసుకోవాలి**



**గద్వాల( ప్రజా జ్యోతి) జూన్ 19:**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ప్రవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా దంద చేస్తూ ఉన్నారు చూస్తూ చూడనట్టుగా వెళ్ళిపోతున్న విద్యాశాఖ అధికారులు వాళ్ళ దృష్టికి తీసుకెళ్లిన కూడా చర్యలు తీసుకొని అధికారులు. విద్యాధికారులకు శ్రీ చైతన్య,ఇతర ప్రైవేటు పాఠశాలలో కూడా ఇదే దందా చేస్తూ ఉన్నారు . ప్రైవేట్ స్కూళ్లకు పర్మిషన్ ఇవ్వడమే కాకుండా వాళ్ళ స్కూల్లోనే బుక్స్ అమ్మడానికి డ్రెస్సులు అమ్మడానికి పర్మిషన్ విద్యాశాఖ వారు ఇచ్చిన రా,ఇవన్నీ కూడా ఎందుకు ఇచ్చినట్లు మరి ఇచ్చి లేకుంటే వారి మీద ఎందుకు మీరు చర్యలు తీసుకోవడం లేదు, ఏవైనా చీకటి ఒప్పందాలు ఉన్నాయా అంటే కచ్చితంగా ఉన్నాయి కాబట్టే చర్యలు తీసుకోవడం లేదు. యజమాన్యాలు తమ పాఠశాల లోగో తో సహా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ను సంప్రదించగా ఆ బుక్స్ మావి కాదని మాట దాటి వేస్తున్నారు ప్రైవేట్ స్థలాలలో స్టాల్స్ నిర్వహిస్తూ అక్రమంగా పాఠ్యపుస్తకాలు 5,000 నుంచి 10,000 వరకు అమ్ముతూ ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు దోపిడీ చేస్తున్నారు ఇలాంటి వారిపై ఏ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు.వెంటనే ఇలాంటి విద్యాధికారులను సస్పెండ్ చేయాలని విద్యార్థులకు న్యాయం చేయాలని టిఆర్ఎస్వి విద్యార్థి విభాగం అధ్యక్షులు మాజ్ డిమాండ్ చేశారు.కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామని వారు తెలియజేశారు . పట్టణంలో ఇళ్లను, షాపులను అద్దెకి తీసుకొని వ్యాపారం నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు.

# ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాలి

**-ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ :19 జూన్** ప్రజా జ్యోతి తల్లిదండ్రి చిన్నారులకు ఐదు సంవత్సరాలు నిండే లోపు అంగన్వాడి కేంద్రాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని చిన్నారులు స్వీకరించేలా ముందుకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి గారు కోరారు.గురువారం తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామం లో "అమ్మమాట అంగన్వాడి బాట"కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి,ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పాఠశాలల్లో చేరి విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రతి తల్లిదండ్రులు గమనించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్



విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే సెలక్షన్ పోస్ట్ లకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి

**మహబూబ్ నగర్ జూన్ 19 ( ప్రజా జ్యోతి ప్రతినిధి )** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే సెలక్షన్ పోస్ట్ లకు ఆన్లైన్ లో జూన్ 23 లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రీజియనల్ డైరెక్టర్ కె. రగుల్ గురు వారం ఒక ప్రకటన లో తెలిపారు. ఫేజ్-/2025/సెలక్షన్ పోస్టుల పరీక్ష 2025 కు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూన్ 2 న ఉద్యోగ నోటిఫికేషన్ ను ప్రచురణ చేసినట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్న భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థలు నివేదించిన వివిధ పోస్టులకు ప్రత్యక్ష నియామకం కోసం దక్షిణ రీజియన్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఓపెన్ కాంపిటీటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు వీలుంటుందని ఆన్లైన్ దరఖాస్తులను జూన్ 23 లోగా సమర్పించాలని కోరారు. ఆన్లైన్ లో పరీక్ష ఫీజు చెల్లించేందుకు జూన్ 24 చివరి తేదీ అని తెలిపారు. సౌత్ రీజియన్ (దక్షిణ ప్రాంతం), కంప్యూటర్ ఆధారిత పరీక్ష 24 జూలై 2025 నుండి 04 ఆగస్టు 2025 వరకు 24 కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఆంధ్రప్రదేశ్లో 12 కేంద్రాలు: పుదుచ్చేరిలో 01 కేంద్రం తమిళనాడులో 08 కేంద్రాలు తెలంగాణలో 03 కేంద్రాలలో ఓపెన్ కాంపిటీటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టుల వివరాలు, వయోపరిమితి, ముఖ్యమైన విద్యార్హత, చెల్లించాల్సిన రుసుము, పరీక్షా నియమావళి, ఎలా దరఖాస్తు చేయాలి మొదలైన వాటికి సంబంధించిన సమాచారం రిక్రూట్మెంట్ నోటీసులో వివరంగా ఇవ్వబడిందని దానికి సంబంధించిన జూశీర్/తీష్టన-జూశీర్-లింక్ ద్వారా వివిధ ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను అభ్యర్థులు పరిశీలించవచ్చని ఆయన తెలిపారు.

# హిందు ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్19:**హిందు ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు.శ్రీ మాణికేశ హా సంస్థానం పీఠాధిపతి శంకరస్వామిజీ సూచించారు. గురువారం ధర్మజాగరణ సమితి, అదిజాంబవ పరియోజన-పాలమూర్ విభాగ్ అధ్వర్యంలో హిందు ధర్మం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ స్వామిజీ మద్దూర్ మండలంలోని దమగాన్ పూర్,పర్సపూర్, మద్దూరు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు.దమగాన్ పూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎల్లమ్మ దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.హిందు ధర్మ, సంస్కృతి గురించి వివరించారు.అనంతరం మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో హిందు ధర్మ పరిరక్షణకు హిందులు విధిగా చేయాల్సిన పనులను వివరించారు.అనంతరం మద్దూరులోని హిందు బంధువులకు అమ్మవారి విగ్రహాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ సమితి ప్రతినిధులు విజయ్. భరత్,రఘు, ప్రశాంత్, శంకర్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం పై పట్టు సాధించాలి





-డిఇఓ రమేష్ కుమార్

**నాగర్ కర్నూల్,జూన్ 19 (ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విషయ పరిజ్ఞానాన్ని అందించేందుకు తరగతి గదిలో విద్యార్థులు పాఠాలను వినడం,నోట్స్ రాయడమే కాకుండా విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు పుస్తక పఠనాన్ని విరివిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ సూచించారు. గురువారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల్లోని తంగిళ్ళపల్లి,దేవుని తిరుమలాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని,విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని,పరిసరాలను పరిశీలించారు. అనంతరం డిఇఓమాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి సమాజంలో అవసరమయ్యే పరిజ్ఞానాన్ని అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.కేవలం ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వినడం, నోట్స్ రాయడమే కాకుండా ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల్లో పఠనా నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేయాలని విద్యార్థులకు బొమ్మలను చూపించడం, మాట్లాడించడంతో పాటు నీతి కథలు, నైతిక విలువలు బోధించడంపై ఆసక్తి కలిగించేలా బోధన కొనసాగించడం అత్యంత కీలకమని తెలిపారు.అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు.ఆయన వెంట జిల్లా బాలిక విద్య అభివృద్ధి అధికారిని శోభారాణి ఉన్నారు.

## ప్రజలకు అందుబాటులోకి ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించాలి





జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**వనపర్తి ప్రతినిధి, జూన్ 19 (ప్రజా జ్యోతి):** విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శిస్తూ పాత నేరస్థుల పై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ల పరిసరాలను, స్టేషన్ పరిధిలో కేసుల వివరాలను స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని సూచించారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా, షీ టీమ్స్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్, 5%ం% అమలు, హెచ్ఆర్ఎంఎస్, జనరల్ డైరీ రికార్డులు, రిసెప్షన్, పిటిషన్ విచారణలకు సంబంధించి పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారనే పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సరిహద్దుల నుండి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ నూతన అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి రూరల్ ఎస్సై జలెందర్ రెడ్డి, వనపర్తి రూరల్ 2వ ఎస్సై బాలయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ

రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన ప్రభుత్వం

**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్19:** నారాయణపేట జిల్లాలో వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ,రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నారాయణపేట జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.వానాకాలం - 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో 1,81,109 మంది రైతులకు రూ. 260.36 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని అన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా గురువారం సాయంత్రం వరకు జిల్లాలోని 1,44,689 మంది రైతుల ఖాతాలలో రూ. 146.55 కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. 19.06.2025 నాడు 4 నుంచి 5 ఎకరాల లోపు 15096 మంది రైతులకు 40.56 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. 5-6-2025 తేదీలోపు పట్టా పాస్ పుస్తకం పొందిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి దరఖాస్తులను 20-6-2025 తేదీలోపు సమర్పించాలని అన్నారు. వివిధ కారణాల చేత నాలుగు ఎకరాల లోపు 151 మంది రైతుల అకౌంట్లో నగదు జమ కాలేదు, అట్టి రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి కొత్త అకౌంట్లను సమర్పించాలి అని అన్నారు.మిగతా రైతులకు కూడా ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని అన్నారు.కాగా, ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

-ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ : జూన్ 19 ప్రజా జ్యోతి తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్, అంతారం, లచ్చిరామ్ తండాలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకి గురువారం ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,వినోద్,మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి





**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,జూన్ 19 (ప్రజా జ్యోతి):** ఆనాడు మఖ్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరిస్తే శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారికి 1001 టెంకాయలు కొడతాన్నని జడ్చర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జానంపల్లి అనిరుద్ రెడ్డి మొక్కు మొక్కున్నారు. అందులో భాగంగా తెలంగాణ యువజన శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేసి పూర్తి బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా జానంపల్లి అనిరుద్ రెడ్డి మఖ్తల్ కు విచ్చేసి శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో పాటు మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి 1001 టెంకాయలు సమర్పించి ఎమ్మెల్యే తన మొక్కును చెల్లించుకున్నారు.మొక్కు చెల్లింపులో భాగంగా శ్రీ పడమటి ఆంజనేయ స్వామివారి సన్నిధిలో తొలి టెంకాయను కొట్టి ముక్కుని చెల్లించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో మంత్రివర్యులతో పాటు మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి,దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పండగలా సాగుతున్న వ్యవసాయం

-సాగుకు సమాయత్తం అవుతున్న అన్నదాతలు

-ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులతో ఆనందం

-గతం కంటే గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణత

-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ : జూన్ 19 ప్రజా జ్యోతి** వానకాలం సాగును నాగర్ కర్నూలు జిల్లాలో రైతులు వ్యవసాయ పనులను పండుగలా చేస్తున్నారని జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని జిల్లాలో గణనీయంగా పంట విస్తీర్ణత పెరిగిందని జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయానికి అవసరమైనా విత్తనాలను, క్రిమిసంహారక మందులను జిల్లా వ్యవసాయ అధికారులు రైతులకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు ఈ సంవత్సరం వర్షాలు కూడా ముందుగా రావడంతో జిల్లాలో అన్నదాతలు సంతోషదాయకంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారనిఅన్నారు. రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైందని, వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని,గత వాన కాలంలో 4 లక్షల 80 వేల ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగు చెయ్యగా ప్రస్తుత వానాకాలంలో 5 లక్షల 92 వేల ఎకరాల భూముల్లో వివిధ రకాల పంటల సాగుకు రైతాంగం సిద్ధం చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు,ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో,చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నరని, విత్తనాల సేకరణకు ముందు రైతులకు రైతు భరోసా నిధులు అందడం మేలు జరుగుతుందని, అందుకు అనుగుణంగానే జిల్లా యంత్రాంగం రైతులకు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించేందుకు సంసిద్ధంగా కృషి చేయడం జరిగిందని,జిల్లాలో 2025-26 వానాకాలం సీజన్ కు గాను గురువారం సాయంత్రం వరకు రైతు భరోసా క్రింద ఎకరానికి 6000/-చొప్పున 2,47,112 మంది రైతులకు 243,55,41,698/- రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లాలో మిగిలిన రైతులకు మరో వారం రోజులలో విడతల వారిగా ఖాతాలలో డబ్బులు జమ చేయటం జరుగుతుందని,బ్యాంకు అకౌంటులో ఎటువంటి తప్పులు వున్నా,లేదా కొత్తగా పాస్ బుక్ జారి అయినను అవసరమైన పత్రాలను సంబందిత వ్యవసాయ విస్తరణ అధికారులను మండల వ్యవసాయ అధికారులకు 20వ తేదీ లోపుగా సంప్రదించాలని కోరారు.ఎటువంటి అపోహలకు తావివ్వకుండా రైతు భరోసా నిధులు జమ చేసే వరకు వేచి వుండాలని,రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,కృతజ్ఞతలు తెలిపారు.రైతుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా,లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

-జిల్లా షెడ్యూల్ అభివృద్ధి అధికారి రామ్ లాల్

**నాగర్ కర్నూల్ : జూన్ 19** ప్రజా జ్యోతి రాష్ట్ర షెడ్యూల్డ్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు ఉమ్మడి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ అభివృద్ధి శాఖ అధికారి రామ్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్,బంజారా హిల్స్, హైదరాబాద్ నందు 2025-26 సంవత్సరానికి నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్ మరియు మెయిన్స్ ఉచిత శిక్షణకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నందు గల %వాజ, ూ, దీజ%,మైనారిటీ అభ్యర్థులు వెబ్ సైటు %ష్ట్రజూ:7/౦ర్బ౧ఎఎఎఅతీఎశ్రీవ.ఎశీ.ఱఅ% నందు ఈ నెల 18 నుండి జులై 07 లోపు ఆన్ లైన్ దరఖాస్తులను చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాంలాల్ మరియు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని అభ్యర్థులు జనరల్/ప్రొఫెషనల్ డిగ్రీ నందు ఉత్తీర్ణులై,వారి తల్లి తండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షలకు మించరాదని,ఎటువంటి ఉద్యోగం చేయకూడని వారు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష హైదరాబాద్ ఎంపిక చేయబడిన ఇతర సెంటర్ల నందు జులై 13న. ఉంటుందని, పరీక్షలో అభ్యర్థులకు వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతి లో లకు 75 లకు 10 మరియు లకు 15ప్రకారంగా ఎంపికచేస్తారని,అమ్మాయిలకు 33.33 సీట్లు రిజర్వ్ అయి ఉంటాయని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు స్టడీ సర్కిల్, బంజారా హిల్స్ లో 10 నెలల పాటు సివిల్స్ - శిక్షణ ఉంటుందని పూర్తి వివరాలకు వెబ్సైటు నందు నోటిఫికేషన్ ను చూడాలని, ఇతర వివరాలకు 040- నెంబర్ల సంప్రదించాలాన్నారు.

## భూ భారతి దరఖాస్తుల విచారణను త్వరగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్ కర్నూల్ : జూన్ 19ప్రజా జ్యోతి** జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తుల ఫీల్డ్ విచారణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు.ఁగురువారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ హాల్ లో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ నూతన ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని,భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని,అందుకు ఆర్డిఓలు, తాహసిల్దార్లు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరు,అక్రమ ఇసుక రవాణా జరగకుండా పకడ్బందీగా అరికట్టాలని ఆర్డీవో లను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారిగా బూతు స్థాయి పోలింగ్ అధికారుల నియామకం,నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు,తాహసిల్దారు తదితరులు పాల్గొన్నారు.